క్లుప్తంగా

మట్కా నిర్వాహకుడి అరెస్ట్



మట్కా నిర్వాహకుడని చూపుతున్న పోలీసులు

తాడిపత్రిటౌన్: పట్టణంలోని నందలపాడులో మట్కా నిర్వహిస్తున్న గంజి యువరాజ్‌ను గురువారం పోలీసులు అరెస్ట్ చేసి, అతడి నుంచి రూ.41,270 నగదు, సెల్‌ఫోన్, మట్కా పట్టీలు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సీఐ సాయిప్రసాద్, ఎస్‌ఐ గౌస్‌భాషా, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి



వ్యాపారులతో సమావేశమైన మున్సిపల్ చైర్మన్ జేసీపీఆర్

తాడిపత్రి అర్బన్: పట్టణాభివృద్ధికి వ్యాపారులు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కోరారు. గురువారం పుట్లూరు రోడ్డులో స్థానిక వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పుట్లూరు రోడ్డు కేవలం 30 అడుగులు మాత్రమే ఉందని, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయంతో పాటు వ్యాపారాలు జరగడం కష్టతరంగా ఉందన్నారు. పట్టణంలో జనాభా పెరుగుతున్న దృష్ట్యా ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తలెత్తుతున్నాయని, వాటి పరిష్కారం కోసం అవసరమైన చోట రోడ్డు విస్తరణ పనులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకు స్పందించిన వ్యాపారస్తులు 15 రోజులు గడువు కావాలని, తామంతా చర్చించుకుని ఏకతాటిపైకొచ్చి అభిప్రాయాన్ని చెబుతామన్నారు.

నేడు ప్రైవేట్ విద్యాసంస్థల బంద్



మాట్లాడుతున్న వంశీయాదవ్

గుంతకల్లుటౌన్/గుంతకల్లు రూరల్: ఫీజులు కట్టలేదన్న కారణంగా చరణ్ అనే ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన నారాయణ కాలేజీ యాజమాన్యంపై కేసు నమోదు చేసి కాలేజీని సీజ్ చేయాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి వంశీయాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు నారప్ప డిమాండ్ చేశారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. విద్యార్థి ఆత్మహత్య ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నియోజకవర్గంలోని అన్ని ప్రైవేట్ విద్యాసంస్థలను బంద్ చేయనున్నట్లు వారు తెలిపారు. నారాయణ కళాశాలను సీజ్ చేయాలని, నారాయణను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు బంద్‌కు సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు వాల్మీకిసాయి, వెంకటేష్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

చిరుత సంచారంతో ఆందోళన

బెళుగుప్ప: మండల పరిధిలోని ఆవులెన్న బెళుగుప్ప గ్రామాల మధ్య చిరుత సంచారంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. రెండు గ్రామాల మధ్య సంచార జాతుల వారు తాత్కాలిక గుడిసెల్లో నివాసం ఉంటున్నారు. వారి పెంపుడు కుక్కలపైనా చిరుత దాడి చేసిందని ఆవులెన్న రైతులు నారాయణస్వామి, ఎర్రిస్వామి తెలిపారు.

పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించండి



మున్సిపల్ సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్, చైర్‌పర్సన్

గుత్తి: పత్రికల్లో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ బిందె వరలక్ష్మి కోరారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఉదయం 11.30 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్ బీ, కమిషనర్ జబ్బార్‌మియా కౌన్సిల్ సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు తాగునీరు, డ్రైనేజీ , రోడ్లు, వీధి దీపాలు తదితర సమస్యలను లేవనెత్తారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ వార్తా పత్రికల్లో మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలు గురించి వార్తలు, కథనాలు వచ్చిన సందర్భంలో వెంటనే స్పందించాలన్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీలో జరిగే ప్రతి కార్యక్రమానికి సంబంధించిన సమాచారం విలేకరులకు తప్పనిసరిగా చెప్పాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏటీఎం కేటుగాళ్లు..!

- వృద్ధులు, మహిళలే టార్గెట్ • కార్డు మార్చి డబ్బులు స్వాహా



స్టేట్ బ్యాంకు ఏటీఎం వద్ద మహిళను ఏమారుస్తున్న మోసగాడు



గుత్తి: గుత్తి, గుత్తి ఆర్‌ఎస్ పట్టణాల్లో ఏటీఎం కేంద్రాల వద్ద కేటుగాళ్లు మాటు వేసి మాయం చేస్తూ ఏటీఎం కార్డులను దొంగలిస్తూ డబ్బులు స్వాహా చేస్తున్నారు. ఏటీఎం కేంద్రాల్లో ఏటీఎం కార్డుల ద్వారా డబ్బు డ్రా చేయడం రాని వారిని టార్గెట్ చేస్తూ డబ్బులు డ్రా చేసి ఇస్తామని నమ్మబలుకుతారు. వారిని ఏమార్చి ఏటీఎం కార్డును మార్చేసి మరో కార్డు ఇస్తూ.. వారు వెళ్లిన తర్వాత డబ్బులు డ్రా చేసుకుంటున్నారు. అమాయకులు, వృద్ధులు, మహిళలే టార్గెట్‌గా కేటుగాళ్లు మాటు వేసి డబ్బులు స్వాహా చేస్తున్నారు. కేవలం నెల రోజుల్లోనే పలువురు అమాయకులను మాయ చేసి ఏమార్చి ఏటీఎం కార్డులు మార్చి వారి అకౌంట్‌లలో ఉన్న డబ్బును దోచేస్తున్నారు.

అమాయకులే లక్ష్యం

గుత్తి పట్టణానికి చెందిన లక్ష్మీదేవి అనే వృద్ధురాలు తన భర్తతో కలసి ఇటీవల స్టేట్ బ్యాంకు ఏటీఎం కేంద్రానికి వెళ్లింది. ఇద్దరికీ ఏటీఎం కార్డు ద్వారా డబ్బులు డ్రా చేయడం రాలేదు. దీంతో అక్కడే ఉన్న కేటుగానికి డబ్బులు డ్రా చేయమని కార్డు ఇచ్చారు. అతడు వారిని ఏమార్చి కార్డును మార్చి ఇచ్చాడు. డబ్బులు డ్రా కావడం లేదని మళ్లీ రావాలని చెప్పాడు. వారు వెళ్లిపోయాక రూ. 9,300 వేలు డ్రా చేసుకుని కేటుగాడు పరారయ్యాడు. అలాగే వెలుగు కార్యాలయంలో పని చేస్తున్న గద్దల లక్ష్మి ఏటీఎం కార్డును మార్చి కేటుగాడు ఏకంగా రూ. 47,000 డ్రా చేసుకుని ఉడాయించాడు. ఎర్రగుడి గ్రామానికి చెందిన శ్రీనివాసులు కార్డును మార్చి రూ. 24,000 డ్రా చేసుకుని పరారీ అయ్యాడు. ఈ నెల 17న ఎంగిలి బండకు చెందిన రాజు ఏటీఎం కార్డును మార్చి కేటుగాడు అందులో ఉన్న రూ. 10,000 స్వాహా చేశాడు.

గర్భిణికి బురిడీ

వారం రోజుల క్రితం గుత్తి అనంతపురం గ్రామానికి చెందిన నిండు గర్భిణీ తన డెలివరీ కోసం దాచుకున్న డబ్బును గుత్తి ఆర్టీసీ బస్టాండ్‌లోని ఇండియన్ ఏటీఎం కేంద్రంలో డ్రా చేసుకోవడానికి వెళ్లింది. అయితే డబ్బులు డ్రా చేయడం రాలేదు. అక్కడే మాటు వేసి ఉన్న కేటుగాడు గమనించాడు. ఆమెను ఏమార్చి ఏటీఎం కార్డును మార్చేశాడు. ఏటీఎం మిషన్ పని చేయడం లేదని ఆమెను నమ్మించాడు. ఆమె అక్కడ నుంచి వెళ్లిపోయాక నిమిషాల్లో రూ. 50 వేలు డ్రా చేసుకుని ఉడాయించాడు. ఇలా కేటుగాళ్లు ఆరు నెలలుగా ఏటీఎం కేంద్రాల వద్ద మాటు వేసి అమాయకులను ముఖ్యంగా ఏటీఎం కార్డు ద్వారా డబ్బులు డ్రా చేసుకునేందుకు రాని వారిని టార్గెట్ చేస్తూ వారి ఏటీఎం కార్డులను తీసుకుని వారి అకౌంట్లలో ఉన్న డబ్బులు స్వాహా చేస్తున్నారు. కేటు గాళ్లు ఏటీఎం కేంద్రాల వద్ద మాటు వేసి అమాయకులు ఏటీఎంలను మార్చి డబ్బులు డ్రా చేస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డు అయ్యాయి. అయినప్పటికీ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. బాధితులు ఫిర్యాదు చేసినపుడు సీసీ కెమెరాలు పరిశీలించడం మిన్నకుండిపోవడం నిత్యకృత్యమైపోయింది. పోలీసులు నిఘా పెట్టి ఏటీఎం కేటుగాళ్లను అదుపులోకి చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.



స్టేట్‌బ్యాంకు ఏటీఎం వద్ద కేటుగాడు

నిఘా పటిష్టం చేశాం



ఏటీఎం కేంద్రాల వద్ద కేటుగాళ్ల పట్టివేతకు నిఘా పటిష్టం చేశాం. క్రైమ్ బ్రాంచ్ పోలీసు అధికారులు సాయం కూడా తీసుకుంటున్నాం. త్వరలోనే మోసగాళ్లను పట్టుకుంటాంరు. ఈ విషయంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. కొత్త వారికి ఏటీఎం కార్డులు ఇవ్వొద్దు. కేటుగాళ్ల పట్టివేతకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. – వెంకటేశ్వర్లు, సీఐ

రెడ్‌బుక్ పేరుతో రాక్షస పాలన



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ రాక్షసపాలన సాగిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు, గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి ధ్వజమెత్తారు. అలవికాని హామీలివ్వడం, అధికారంలోకి వచ్చాక ప్రజలను నిలువునా ముంచేయడంలో చంద్రబాబును మించిన మోసగాడు మరొకరు లేరని ఆమె మండిపడ్డారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడానికి డబ్బుల్లేవని చెప్పడం చంద్రబాబు చేతకానితనానికి నిదర్శనమన్నారు. డబ్బుల్లేవని చెప్పినంత మాత్రాన వదిలిపెట్టే ప్రసక్తేలేదని, ప్రజలకిచ్చిన హామీలన్నీ అమలు చేసే వరకూ ఉద్యమాలు కొనసాగిస్తామమన్నారు. ఆరోగ్యశ్రీలాంటి బృహత్తర కార్యక్రమాలకు నిధులివ్వకుండా పేదప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సిగ్గుచేటన్నారు. నారాయణ కాలేజీ యాజమాన్యం వేధింపులు తాళలేక ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం బాధాకరమన్నారు. సూపర్‌సిక్స్ పథకాలివ్వలేనని చంద్రబాబు బహిరంగంగా చెబుతున్నా ప్రశ్నిస్తానన్న పవన్‌కళ్యాణ్ ఎందుకు నోరు మెదపడం లేదని ఆమె నిలదీశారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఇచ్చిన హామీలను అమలు చేసి మాజీ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజానాయకుడిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ జింకల రామాంజనేయులు, కౌన్సిలర్లు లింగన్న, చాంద్‌బాషా, కోఆప్షన్‌సభ్యుడు ఫ్లయింగ్‌మాబు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, పార్టీ అనుబంధ సంఘాల నియోజకవర్గ అధ్యక్షుడు బాసిద్, పవన్, తిక్కస్వామి, రంగనాయకులు, అంజి, హాజీ, బాబూరావు, షాబుద్దీన్, సూర్యారెడ్డి, వార్డు ఇన్‌చార్జ్‌లు ఎల్లప్ప, శేఖర్, కరీమ్, ఖలీల్, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులకు గుమ్మనూరు క్షమాపణలు చెప్పాలి

తనకు వ్యతిరేకంగా వార్తలు రాస్తే విలేకరును పట్టాలపై పడుకోపెడతానన్న స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ పాత్రికేయులకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జోనల్ చైర్మన్ జింకల రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఇది ప్రజాస్వామ్యమా లేక రౌడీ రాజ్యమా అని ఆయన ప్రశ్నించారు. చింతలాంపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను బట్టలూడదీసి కొట్టిన రూరల్ కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలన్నారు.

గాంధీ అడుగుజాడల్లో నడుద్దాం



గుంతకల్లులో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నైరుతిరెడ్డి



యాడికిలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్య వైశ్యులు

గుంతకల్లుటౌన్/యాడికి: జాతిపిత మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయాల సాధనకు పాటుపడాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి, మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సుంకప్ప అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు మెయిన్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లింగన్న, సుమోబాష,చాంద్‌బాష, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ భీమలింగప్ప, పార్టీ అనుబంధ విభాగాల నియోజకవర్గం అధ్యక్షులు అంజి, బాసిద్, పవన్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే యాడికిలో ఉన్న గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్యం సంఘం మండల అధ్యక్షుడు జయవరం చంద్రశేఖర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదిత్య, విశ్వనాథ్, గాధం శెట్టి బలరామయ్య, జీఎస్టీ రవి, బదిరి, రాజు, శ్రీహరి, మురళి, ప్రదీప్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. కోన రోడ్డులోని విశాలాక్షి ఖాదీ సిల్క్ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ సభ్యులు నారాయణ స్వామి, దాసరి కృష్ణ, చంద్రశేఖర్, మురళి, ఓబులేసు, తిరుమలేసు తదితరులు గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

గుంతకల్లుటౌన్: నెల్లూరులో ఫిబ్రవరి 1 నుంచి నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు గురువారం పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు బి.శ్రీనివాసులు పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. పార్టీ పట్టణ కార్యదర్శి మారుతి, నాయకులు నాగరాజు, రమేష్, సురేంద్ర, అబ్దుల్లా, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

2న కంటి వైద్య శిబిరం

తాడిపత్రి అర్బన్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తాడిపత్రి లయన్స్ క్లబ్ కమిటీ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. ఆదివారం యల్లనూరు, పుట్లూరు మండల కేంద్రంల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈ శిబిరాలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. వైద్య శిబిరంలో చికిత్స అనంతరం కర్నూలు శాంతిరామ్ హాస్పిటల్ లో శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు.

మాఘమాస ఉత్సవాలు ప్రారంభం



భోగేశ్వరాలయంలోని శివలింగాన్ని అలంకరించిన దృశ్యం



శివమాలధారులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో నెల రోజులపాటు నిర్వహించే మాఘమాస ఉత్సవాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయలంలోని ప్రాచీన మూలవిరాట్ శివలింగాన్ని, ప్రసన్న పార్వతీదేవిని శోభాయానంగా అలంకరించారు. ప్రధాన అర్చకుడు దేవగుడి రామేశ్వరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు చంద్రాశర్మ, అనిల్ తదితరులు శివపార్వతుల విగ్రహాలకు అభిషేకార్చన, పంచామృత, అష్టోత్తర వంటి విశేషపూజలు చేశారు. మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అలాగే కల్లూరు పారిశ్రామికవేత్త రాంప్రసాద్ సౌజన్యంతో 150 మంది శివమాలధారులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యుడు, కవి నారాయణ మూర్తి, అర్చకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

పామిడి: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. గురువారం స్థానిక పీ కొండాపురం రోడ్డులోని విశాల ఫెడ్రర్ వికలాంగుల మండల సమాఖ్య కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. కమ్యూనిటీ హాల్ పొడగింపు నిర్మాణంతో పాటు ప్రహరీ, టాయిలెట్లు నిర్మించాలన్న వికలాంగ సమాఖ్య విజ్ఞప్తిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అంతకుముందు ఎంపీ నిధులు రూ.7 లక్షలతో నిర్మించిన భవనాన్ని ఆయన ప్రారంభోత్సవం గావించారు. అనంతరం ఆయన మండలంలోని ఎద్దులపల్లి, పాళ్యం, కత్రిమల గ్రామాల్లోని సీసీ రోడ్లను ప్రారంభించారు. తహసీల్దార్ శ్రీధరమూర్తి, ఎంపీడీఓ తేజోత్స్న, టీడీపీ మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్, మండల కన్వీనర్ ముసలిరెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ కత్రిమల ప్రభాకర్‌చౌదరి, మాజీ ఎంపీటీసీలు బొల్లు శ్రీనివాసరెడ్డి, జింకల సంజీవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కసాపురంలో వివిధ రకాల పనులకు టెండర్లు



టెండర్లలో భాగంగా బహిరంగ వేలం నిర్వహిస్తున్న అధికారులు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో ఏడాది పాటు నిర్వహించే వివిధ రకాల పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను గురువారం నిర్వహించారు. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఏడాది మార్చి 31వ తేదీ వరకూ ఆలయంలో భక్తులు సమర్పించే తలనీలాలు, కొబ్బరి చిప్పలు, బియ్యం బేడలు పోగుతో పాటు ప్రసాదాల తయారీకి అవసరమైన ముడిసరుకుల సరఫరా, టోల్‌గేట్ నిర్వహణ, తమలపాకుల సరఫరా, ఔట్ సోర్సింగ్ వర్కర్ల సరఫరా వంటి 30 రకాల పనులకు షీల్డు టెండర్, ఈ–టెండర్, బహిరంగ వేలం పాటను నిర్వహించారు. వాహనాల పార్కింగ్‌కు నిర్వహించిన బహిరంగ వేలం పాటలో కసాపురం గ్రామానికి చెందిన హరిశ్చంద్ర రూ.7.10 లక్షలు పాడి దక్కించుకున్నారు. సప్లయర్ సామాన్లకు 4, అగర్‌బత్తీలకు 2, ఐస్‌క్రీమ్ విక్రయ హక్కుకు 2, పువ్వుల సరఫరాకు 2, రక్షా కంకణాలకు 1, కందువాల సరఫరాకు 3, ప్లంబింగ్ సామగ్రి సరఫరాకు 2, ప్రసాదం కవర్ల సరఫరాకు 1, తమలపాకుల సరఫరాకు 3, ఎలక్ట్రికల్ సామగ్రి సరఫరాకు 2 చొప్పున షీల్డు టెండర్లు దాఖలయ్యాయి. వీటిని పరిశీలించిన అనంతరం ఈ నెల 31న వివరాలు వెల్లడించనున్నట్లు ఆలయ ఈఓ కె.వాణి తెలిపారు.

ఆరేళ్ల క్రితం తప్పిపోయిన మహిళ ఆచూకీ లభ్యం



కేరళలోని కాసరగడ్‌లో లక్ష్మీదేవిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

గుత్తి: ఆరేళ్ల క్రితం తప్పిపోయిన మహిళను గుత్తి పోలీసులు గుర్తించి, తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయించారు. వివరాలు... గుత్తిలోని దాసరి కాలనీకి చెందిన వివాహిత లక్ష్మీదేవి 2019, ఏప్రిల్ 18వ తేదీ నుంచి కనిపించకుండా పోయింది. ఘటనపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అదే ఏడాది ఏప్రిల్ 20న పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో కేరళలోని కాసరగడ్‌లో ఉంటున్న లక్ష్మీదేవిని గుర్తించి ఏఎస్‌ఐ ఆజాద్, పీసీ భాస్కర్‌నాయుడు అక్కడకు చేరుకుని ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచే వర్చువల్ విధానంలో గుత్తి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయించారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంతకల్లు రూరల్: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం లబ్ధిదారులు ఫిబ్రవరి 7లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో శ్రీకాంత్‌చౌదరి గురువారం తెలిపారు. గుంతకల్లు మండలానికి 35 బీసీ కార్పొరేషన్ రుణాలు మంజూరయ్యాయని, అందులో బీసీ ఏ-15, బీసీ బీ-11, బీసీ సీ-05, బీసీ డీ-4 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. అదేవిధంగా ఎకనామికల్లీ బ్యాక్‌వర్డ్ కాస్ట్ కింద ఈబీసీ-2, రెడ్డి-1, కమ్మ-1, బ్రాహ్మిణ్-1 మంజూరయ్యాయన్నారు. రూ.1.75 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ యూనిట్ విలువ గల రుణాలను ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో అందజేస్తుందన్నారు. రుణాలు కావాల్సిన లబ్ధిదారులు ఫిబ్రవరి 7లోపు మీసేవ లేదా సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

గుంతకల్లుటౌన్: బీసీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా మంజూరు చేయనున్న సబ్సిడీ రుణాల కోసం ఫిబ్రవరి 7లోగా దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలకు-97, కాపులు-10, ఏపీఈబీసీ-4, రెడ్డి-1, కమ్మ-2, ఆర్యవైశ్య-2, ఏపీ బ్రాహ్మణ వర్గానికి-1 చొప్పున మొత్తం 117 మందికి సబ్సిడీ రుణాలిస్తామన్నారు. అలాగే బీసీ-1, ఏపీఈబీసీ-1, ఆర్యవైశ్య-1 చొప్పున జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలందజేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9849907419కు సంప్రదించాలన్నారు.

వాసవీ మాత విగ్రహ ప్రతిష్టకు నేడు భూమిపూజ

తాడిపత్రి అర్బన్: వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా రూరల్ పరిధిలోని ఐశ్వర్య విల్లాస్ సమీపంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ మాత విగ్రహ ప్రతిష్టకు శుక్రవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తలుపుల సురేంద్రనాథ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఉదయం 8 గంటలకు జరిగే భూమి పూజ మహోత్సవానికి ముఖ్య తిథులుగా ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి హాజరవుతారన్నారు. అలాగే వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం సాయంత్రం అధికార లాంఛనాలతో అమ్మవారికి పుష్పయాగం నిర్వహిస్తామన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు



ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

బుక్కరాయసముద్రం: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని కొర్రపాడు పీహెచ్‌సీ డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని అన్నారు. గురువారం మండలంలోని ఎస్సీ కాలనీలో ప్రజలకు కొర్రపాడు పీహెచ్‌సీ కేంద్రం ఆధ్వర్యంలో కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కుష్టు వ్యాధి నిర్మూలనపై ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. శరీరంపై రంగు గల మచ్చలు, స్పర్శలేని మచ్చలు, రాగి రంగుల మచ్చలు, పాలిపోయిన మచ్చలు దురద లేని మచ్చలు ఉన్నట్లు అయితే వైద్య సిబ్బందికి తెలపాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మోహన్‌బాబు, సామాజిక ఆరోగ్య అధికారి పర్వీన్, కేశవయ్య, రామలక్ష్మి, రాజేంద్ర, ప్రసాద్, హరిత, రాములమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంది కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గుత్తి ఏడీఏ వెంకటరాముడు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కంది కొనుగోలు కేంద్రాన్ని గుత్తి ఏడీఏ వెంకటరాముడు, ఏఓ మల్లీశ్వరి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో కందుల కొనుగోలు ప్రారంభించామన్నారు. క్వింటాల్ ధర 7,550గా ప్రభుత్వ నిర్ణయించిందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రజిని, సునీత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

